

# సుందరి

"సుందరి ఈరోజు రాలేదా ?" ఆత్రుతగా అడిగాడు పాపారావు.

"ఎవరు ? ఆ బ్యాక్ బ్యూటీయేనా ?" పాపారావును లోతుగా చూస్తూ కామేశం అన్నాడు.

"అంటే" నిజంగానే అర్థం కాలేదు పాపారావుకి.

"ఓర్నీ, ఈమాత్రం తెలీదా ? కలర్ననుసరించి బ్యూటీనెస్‌ని కొలిచినట్టే, బ్యాక్‌ననుసరించి, ఫ్రంట్‌ననుసరించి, టాప్‌ననుసరించి..."

"ఆపాపు..." ఇంకేమేమంటాడోనని భయపడిపోయాడు పాపారావు.

"ఆ ! ఏంటి ఈమధ్యేదో ట్రాక్ మారినట్టు కనిపిస్తోంది. సుందరికి గాని లైనేస్తున్నావా ?" కనుబొమలెగరేశాడు కామేశం.

పాపారావు ఏ భావం కనబడనీయకుండా, వినబడనీయకుండా జాగ్రత్తపడ్డా, 'మౌనం-అంగీకారం' ఈక్వేషన్‌లో విలువల్ని ప్రతిపాదించేశాడు కామేశం.

"చూడు గురూ ! నీ మంచికోరి చెబుతున్నాను. దాని గురించి అట్టే ఆలోచించి మనసు పాడుచేసుకోకు. అది ఉత్త న్యూస్ పేపర్ టైపు" జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

"న్యూస్ పేపరా ? అంటే బాగా వాగుతుందా ? ఏదీ దాచుకోదనా?" సుందరి స్వభావాన్నెరిగిన పాపారావు కామేశం ఉపమానాన్ని ఉపమేయానికి జోడించుకోలేక తికమకపడ్డాడు.

ఫస్ట్ పఫ్ గట్టిగా లాగి, పాపారావు మాటలకి తట్టుకోలేనట్టు నవ్వి, గొంతులో సమన్వయం లోపించగా నవ్వలేక-దగ్గలేక ఉక్కిరిబిక్కిరయ్యాడు కామేశం.

"ఓర్నీ, ఉత్త పాతకాలపు మనిషిలాగున్నావే. న్యూస్ పేపరంటే అదిగాదయ్యా, పుస్తకం లాంటిది కాదు !" అన్నాడు సంభాలించుకుంటూ.

'వీడికేమైనా పిచ్చా ? వీడు మాట్లాడుతున్నదేంటో వీడికే ఎక్కేట్టు లేదు. కొంపదీసి పొద్దున్నే మందేసిగాని...' విస్మయంలో పాపారావు.

"అర్థం కాలేదు కదూ !" పాపారావు మనసును చదివేసినట్టు అన్నాడు. కామేశం. ఈసారేదో రహస్యం చెబుతున్నట్టు గొంతు తగ్గించి మరీ చెప్పాడు- "పుస్తకం అంటే ఫ్యామిలీ టైపు. ఎప్పుడూ భద్రంగా దాచుకునేది. పేపరంటే ఒక్కసారి చూసి పారేసేది" బిగ్గరగా నవ్వాడు.

'ఛ ! వీడి తెల్లడ్రెస్ వెనక ఇంత మకిలమైన ఆలోచనలు, నెరిసిన జుట్టు కింద ఏమాత్రం వికసించని బుద్ధి' బయటికి [illegible]

"నిజమే ! పవిత్రత, నిజాయితీ అనే విషయాలు శరీరంతో సంబంధం లేనివనీ, నేను వాటి గురించి అంతగా పట్టించుకోననీ చెప్పాను. దానర్థం నేను చెడిపోయినదాన్నని కాదుగదా !" పాపారావు మొహంలోభావాల్ని చదివే ప్రయత్నం చేస్తూ అంది సుందరి.

పార్కులో ఓ మూల, అంతగా డిస్టర్బెన్స్ లేనిచోట కూర్చున్నారిద్దరూ.

"పెళ్లి వ్యాపారానికయ్యే లావాదేవీలు నా దగ్గర చెల్లవని చెప్పాను. కరెక్టే. దానర్థం పెళ్లిని వ్యతిరేకిస్తున్నానని కాదు కదా ! "

"అదీ..." కసిగా గడ్డిపరకను పీకాడు. మట్టిబెడ్డతో సహా వచ్చేసింది.

"చూడండి ! నాకంటె తక్కువ హోదాలో ఉన్నా, బాగా చదువుకున్నారని, అంతకు మించి సంస్కారవంతులని, పైగా నన్నర్థం చేసుకున్నారని భావించానే తప్ప మీరూ నా గురించి చీప్‌గా..."

"నో..." హిపోక్రసీ గోడలు కూలిపోవడాన్ని తట్టుకోలేకపోయాడు పాపారావు. "ఇప్పుడేమైందనీ ?" ఆలోచించుకోవడానికి అవకాశం కోసం ప్రతి ఒక్కరూ చేసే ప్రయత్నమే (ప్రశ్నించడం) అతడూ చేశాడు.

"ఏమీ కాకూడదనే ఇదంతా !" మరింత దృఢంగా అంది సుందరి. "నా గురించి మీకేవిధమైన సందేహాలున్నా నన్నడగండి. నిర్మొహమాటంగా నేనే చెబుతాను. అనవసరంగా వాళ్లనీ వీళ్లనీ అడగటం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ"

"ఉద్యోగం చేసే ఆడదాని గురించి ఈ సమాజం ఎంత చీప్‌గానైనా ఆలోచిస్తుంది. ఆమాత్రం గ్రహించలేరా ?"

ఈ సీనంతా ముందు ఊహించలేదు పాపారావు. ప్రత్యర్థి బౌలర్స్ క్యాసెట్‌ని రాత్రంతా స్టడీ చేసి పొద్దున్న బ్యాటింగ్‌కి దిగగానే కొత్త బౌలర్ నెదుర్కొన్నట్టుంది అతని పరిస్థితి. ఎంతో సౌమ్యంగా, సహనంగా ముద్ద మందారంలా కనిపించే ఆమె, ఇలా అగ్నిపూవులా మారుతుందనుకోలేదు.

"అడగండి !" పాపారావు మౌనాన్ని సహించలేక రెట్టించింది.

"నాకు కొంత టైం కావాలి" ఆలోచనల్లోంచి తేరుకోలేదతడు.

"ఓకే. టేక్ యువర్ ఓన్ టైమ్. బట్ వన్ థింగ్, అంత వరకూ మన మధ్య ప్రేమ–పెళ్లి ప్రస్థావన తేవద్దు. అంటిల్‌దెన్ జస్ట్ వుయార్ కొలీగ్స్– దట్సాల్ !"

సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్తున్న సుందరిని చూస్తుంటే, అంత అయోమయంలో కూడా కామేశం అన్న 'బ్యాక్ బ్యూటీ' గుర్తొచ్చింది పాపారావుకి. 'ఎంతెంత

మాటలంది ?' వర్తమానంలో జీవించలేక భూతకాలంలోని చేతగానితనాన్ని నిందించుకునే సగటు మనిషి ఆలోచనలు పాపారావుని చుట్టేశాయి.

'అసలెందుకు దీనికింత టెక్కు ? నిజంగా బ్యాక్ బ్యూటీయే. ముందు నుంచి పడగొట్టేంత అందమేం కాదు. నా పిచ్చిగానీ అంత అందమే ఉంటే ఇంత ముదిరిపోయే దాకా ఉంటుందా ? హు ! పెళ్లి కాకుండానే నా మీద ఇంత అధికారం చెలాయిస్తోంది. పెళ్లయితే నన్ను బతకనిస్తుందా ? కామేశం చెప్పిన మాటల్లో అబద్దాలేవీ కాకపోవచ్చు. ఏదో మగదిక్కులేని కొంప. అందమూ, అణకువా ఉన్నాయి. సంపాదనకి లోటులేదు. తననీ బాగానే అర్థం చేసుకుంది, సరే సర్దుకుపోదామనుకున్నాడు. కానీ ఎంత పొగరు... ఇంతకింత చేసి చూపించాలి !' గట్టిగా నిర్ణయించుకున్నాడు. పాపారావు.

❊ ❊ ❊

"ఈశ్వరీ ! నీకు మీవాళ్లు తప్పుడు పేరు పెట్టారోయ్ !" డ్రెస్సింగ్ టేబుల్ ముందు నుంచుని ముస్తాబవుతున్న భార్యని వెనక నుంచి గట్టిగా వాటేసుకుంటూ బుగ్గను తన గెడ్డంతో రుద్దాడు పాపారావు.

"అబ్బ ! వదులు ! ఏంటింత మోటుగా !" వాంతి చేసుకున్నట్టు మొహం పెట్టి, అతని చేతుల్ని విసిరి కొట్టింది ఈశ్వరి.

పాపారావు సున్నితమైన మనసుకు తగిలిందది. మౌనం వహించాడు అంటే అలిగాడు. అదేమీ పట్టించుకోలేదు ఈశ్వరి.

"ఏంటీ, పెళ్లయి వారమైనా తిరక్కుండానే మా వాళ్లని సాధించేస్తున్నావ్ ? ఎందుకు ? ఇప్పుడు నా పేరుకేమొచ్చిందనీ ?" కనుబొమలు ముడేసి కరుకుగా అంది.

'నీ పేరు ఈశ్వరి అనిగాక, ఊర్వశి అనుంటే నీ అందానికి సరిగ్గా అతికినట్టు సరిపోయేది !' ఎంతోసేపటి నుంచి రిహార్సల్స్ వేసుకున్న డైలాగ్ గొంతులోనే వుండిపోయింది.

"ఏంటీ అలకా ? ఇదుగో, ఇప్పుడే చెబుతున్నా. ఈ వేషాలన్నీ నా దగ్గర కాదు. నన్నుగానీ, నా వాళ్లనిగానీ పల్లెత్తుమాట అంటానికి వీల్లేదు. నీకంటే అందగాళ్లు, మంచి హోదా వెలగబెడ్తున్న వాళ్లకెందరికో నేన్నచ్చాను. ప్చ్ ! కట్నం దగ్గర కక్కుర్తిపడి మా నాన్న ఈ దిక్కుమాలిన సంబంధం ముడిపెట్టాడు."

హతాశుడైపోయాడు పాపారావు. 'ఇంత అహంకారమున్న ఈశ్వరిని సుందరిగారి వద్దకి తీసుకెళ్తే... అక్కడ తన పరువూ మర్యాదా ఏమైపోతాయి ?

'తనకి చెప్పకుండా తనకంటే (నిజంగానే) అందమైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను. ఇది ఆమె మంచి మనసును గాయపరచడమే. ఇది చాలదన్నట్టు, మొహమ్మీద

కొట్టినట్టు ఈమెను తీసుకెళ్లి మరీ చూపించాలా ? వద్దు. ఈశ్వరి ఆలోచనా సరళి తెలిసింతర్వాత కూడా తన ప్రయత్నం విరమించుకోకుంటే, అంతకు మించిన బుద్ధి తక్కువ పని మరొకటి వుండదు. "ఛ !" చివరిమాట మాత్రం పైకే అనేశాడు.

"ఏంటి ? 'ఛా' గుణింతాలు మొదలెట్టావ్ ? ఎక్కడికో వెళ్దాం తయారు కమ్మన్నావ్ కదా ! ప్రోగ్రామ్ క్యాన్సిలా ?" కనుబొమలెగరేసింది ఈశ్వరి.

"ఎస్ ! కాన్సిల్ !" కసిగా వత్తిపలుకుతూ అక్కడినుంచి కదిలాడు పాపారావు.

"ఆగు !" ఈశ్వరి గొంతులోని 'చెక్' పాపారావుని కదలనీయలేదు.

"ఏంటీ అంతా నీ యిష్టమేనా ? నాకిష్టం లేకపోయినా, రెడీ కమ్మన్నావు గదా అని గంటసేపటి నుంచీ అదే పనిలో ఉన్నాను. ఇప్పుడదంతా వేస్టేనా ? అదేం కుదరదు. ఇలాంటి తుగ్లక్ ఆలోచనలంటే నాకు పరమ అసహ్యం" కటువుగా అంది ఈశ్వరి. "ఏం ఇప్పుడేమైందనీ ? నిన్ను కౌగిలించుకోకుండా అడ్డుకున్నాననా ? లేకుంటే, నీకంటే అందంగా ఉన్న నన్ను అందరూ ఆబగా చూస్తారనా ?"

"షటప్ !" గట్టిగా అరిచాడు.

"నేనంతకంటే గట్టిగా అరవగలను." తర్జని చూపిస్తూ అంది, "ఒక్కటి గుర్తుంచుకో. నేను నీ బానిసను కాను, భార్యను ! నీకెంత అధికారముందో, నాకూ అంతే ఉంటుంది. మాట్లాడకుండా బయలుదేరు"

ఆ స్వరంలోని శాసనానికి భయపడ్డాడో, పరువు కాపాడుకునే ప్రయత్నంలో పడ్డాడోకానీ, మౌనంగా సుందరి వాళ్లింటికి బయలుదేరాడు ఈశ్వరితో.

❋ ❋ ❋

ఎప్పటిలాగే పాపారావు ఊహల్ని నిజం చేయలేదు, సుందరి ఇంట్లోని సీన్. తన అందమైన భార్యను చూసి సుందరి షాకవుతుందని, ఆమె మొహం మాడిపోయి కనీసం తమని సరిగ్గా రిసీవ్ చేసుకోదని, ఈశ్వరి కూడా ఆ వాతావరణం తట్టుకోలేక నానా రభసా చేస్తుందనుకున్నాడు. కానీ–

సుందరి చాలా క్యాజువల్‌గా, అంతకుమించి ఆనందంగా తమని రిసీవ్ చేసుకుంది. పైగా సుందరి ఈశ్వరీ చాలా కాలంగా పరిచయమున్న వాళ్లలా మాట్లాడుకున్నారు.

"మీరు మరోలా అనుకోకూడదు. ముందుగానే మీ పెళ్లి గురించి తెలిస్తే మంచి గిఫ్ట్ ప్రెజెంట్ చేసేదాన్ని. ప్రస్తుతం ఇదే ఉంది. నా బర్త్‌డే కోసం తీసుకున్న శారీ ! నా

టేస్ట్ మీకు నచ్చకపోవచ్చు. ప్లీజ్ ఆక్సెప్టిట్ !" అంటూ బలవంతంగా ఈశ్వరి చేతుల్లో ఓ శారీ పాకెట్ ఉంచింది.

అప్పుడు గుర్తొచ్చింది పాపారావుకి మరో రెండు రోజుల్లో ఆమె బర్త్‌డే అనే సంగతి. ఈశ్వరి ఆ కవర్‌ని మొహమాటపడుతూనే తీసుకుని "థాంక్స్" చెప్పింది.

బయలుదేరే ముందు ఏదో గుర్తొచ్చినట్టు ఠక్కున ఆగిపోయాడు పాపారావు. "మేడమ్ ! మీ అమ్మగారిని కలిసి, ఆమె ఆశీర్వదాలు తీసుకు... " కూడబలుక్కున్నట్టన్నాడు.

"తను రెస్టు తీసుకుంటోందండీ ! ఇంకోసారి వచ్చినప్పుడు..."

"మరేం పర్వాలేదులే నాయనా !" సుందరి మాటల్ని అడ్డుకుంటూ, డోర్ కర్టెన్‌ని తొలగించుకుంటూ ఓ పెద్దావిడ ముందుకొచ్చింది. కళ తప్పిన ఆమె మొహం మీద వికారంగా తెల్లటి మచ్చలున్నాయి.

"సుందరి వారిస్తున్నా వినకుండా ఆమె మాట్లాడుతోంది. విస్ఫోటనం చెందిన బాధాశిఖరం నుంచి స్రవిస్తున్నలావాలా ఆమె మాటలు సాంద్రంగా, ఆర్ద్రంగా, అగ్నికణాల్ని తలపించేవిగా ఉన్నాయి.

"నా ఆశీర్వాదాలెవరికీ అవసరం లేదు బాబూ ! కానీ మీలాంటి దంపతుల ఆశీస్సులు నా బిడ్డకి అవసరం ! ఏ జన్మలో చేసుకున్న పాపమో, నన్ను పాములా పీడిస్తూ, నా బిడ్డను శాపగ్రస్థురాలిని చేసింది. ఈ వ్యాధి బారిన పడిన నన్నందరూ అసహ్యించుకున్నారు. కట్టుకున్నవాడు, కన్నకొడుకూ నా మానానికి నన్ను వదిలేస్తే, నా చిట్టితల్లే నాకు తల్లిలా పెద్దదిక్కై నన్ను పసిపిల్లలా చూసుకుంటోంది. నా కారణంగా జీవితంలో అది ఏ సుఖానికీ నోచుకోకుండా పోతోంది. పెద్ద మనసున్న మహనీయులెవరైనా నా తల్లికి సౌభాగ్యం ప్రసాదించాలని, దాన్ని ఆశీర్వదించండి బాబూ !" రెండు చేతులూ జోడించింది యాభై ఏళ్ల ఆ మాతృమూర్తి.

మార్చి మార్చి ఆ తల్లుల్ని చూస్తుండిపోయారు పాపారావు దంపతులు.

**(16-5-2002 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)**